


# నల్లని మెరుపు! కె.ఎస్.ఎమ్.ఫణీంద్ర

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ**

1

అమెరికాని దర్జాగా చూడాలి అంటే కారులో తిరగాలి. అమెరికాని దగ్గరగా చూస్తూ, ప్రకృతిని ఆస్వాదించాలి అంటే నడుస్తూ తిరగాలి. అయితే నిజమైన అమెరికా జీవనాన్ని చూడాలంటే సిటీబస్సో, లోకల్ ట్రైనో ఎక్కాలి. అక్కడ సాఫ్ట్వేర్ ఉద్యోగీ, సూపర్‌మార్కెట్ క్లర్కూ పక్కపక్కనే కలిసి వెళ్తారు. ఎన్నో మనస్తత్వాలనీ, జాతులనీ చూడొచ్చు. వారిలోని మనిషిని పలకరించొచ్చు. కొన్ని సార్లు జీవితసత్యాలనీ తెలుసుకోవచ్చు, నేను నేర్చుకున్నట్టు!

అప్పటికి నేను అమెరికా వచ్చి ఏడాదైంది. కాలిఫోర్నియా జీవితానికీ, ఏడాది పొడుగునా మెరిసే ఎండకీ, శాండియాగో అనే మా ఊరిలోని సముద్రపు సౌందర్యానికీ అలవాటుపడ్డాను. రోజూ సొంత కారులో ఆఫీసుకి వెళ్ళిరావడమూ అలవాటైంది. మొదట్లో అది హాయి అనిపించినా కొద్ది నెలల్లోనే అదో రొటీన్ అయ్యి విసుగుపుట్టింది. సరే! మా ఊర్లోని సిటీబస్లో ఆఫీసుకి వెళ్దామని నిశ్చయించుకున్నాను. "గ్రీన్ ఇనీషియేటివ్" పేరు మీద ఇలా సొంతకార్లలో కాక కార్-పూల్, పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ లో వెళ్ళే వాళ్ళకి మా కంపెనీ వాళ్ళు కొంత సబ్సిడీ ఇస్తారు కూడా. ఇలా నేను లాభం పొందుతూ, భూమికీ భారం తగ్గిస్తూ, డ్రైవింగ్ గోల లేకుండా హాయిగా రిలాక్స్ అవుతూ ఆఫీసుకి వెళ్ళడం మొదలెట్టాను.

మొదటిరోజు సాయంత్రం ఆఫీస్ నుంచి ఇంటికి బస్సెక్కాను. కిటికీ సీట్ దొరికింది. కూర్చుని అందమైన శాండియాగో నగరాన్ని చూస్తున్నాను. రోజూ అదే దారిలో వస్తున్నా ఎప్పుడూ గమనించని బిల్డింగులూ, చెట్లూ చూసి ఆశ్చర్యపోయాను, ఇన్నాళ్ళు ఎలా గమనించలేదా అని. ఒకలాగ చూడడానికి అలవాటుపడ్డ కళ్ళు సరికొత్తగా చూడడానికి కొత్త అనుభవాలు కావాలేమో!

అలా నేను హాయిగా ప్రయాణాన్ని ఆస్వాదిస్తూ ఉండగా బస్ ఒక స్టాపులో ఆగింది. అక్కడ ఒక ఆఫ్రికన్ అమెరికన్ వైట్ చేస్తున్నాడు. చాలా మంది ఆఫ్రికన్ అమెరికన్ల లానే అతనూ ఎత్తుగా బలంగా ఉన్నాడు. ఏడాది అమెరికా జీవితంలో చాలా మంది ఆఫ్రికన్ అమెరికన్స్ తారసపడ్డా, పలకరింపులే తప్ప ఎవరితోనూ పెద్దగా పరిచయాలూ స్నేహాలూ లేవు. అతని వాలకం చూస్తే మటుకు ఏదో భయం వేసింది!

భయం! అవును, భయం! నేను అమెరికా వచ్చేముందు చాలా మంది భయపెట్టారు.

"రాత్రి వేళల్లో బైట తిరగడం అమెరికాలో సేఫ్ కాదుట! జేబులో డబ్బులు ఎక్కువ పెట్టుకోకు. అక్కడ నల్లవాళ్ళు గన్ తో బెదిరించి దొంగతనాలు చేస్తార్ట, జాగ్రత్త" అని నాన్న పదే పదే చెప్పారు.

"లేదు, శాండియాగో లో అలాంటి గొడవలు లేవు!" అని నేను సర్దిచెప్పాను.

అయితే నేను వచ్చేముందే శాండియాగో లో మా కొలీగ్ ఒకరు రాత్రి ఆఫీస్ నుంచి హోటల్ కి వెళుతూ ఉంటే ఒక ఆఫ్రికన్ అమెరికన్ గన్ తో బెదిరించి ల్యాప్ టాప్ ఎత్తుకెళ్ళాడని తెలిసింది. మొదటిసారిగా కొంచెం భయం వేసింది! శాండియాగో ఎయిర్ పోర్ట్ లో దిగాక క్యాబ్ డ్రైవర్ ఒక అఫ్రికన్ అమెరికనే వచ్చాడు. నేను సందేహిస్తూనే క్యాబ్ ఎక్కాను. హోటల్ కి చేరే వరకూ భయపడుతూనే ఉన్నాను! తర్వాత తర్వాత ఆఫ్రికన్ అమెరికన్లను చూడడానికీ, వాళ్ళతో సంభాషణకీ అలవాటుపడ్డాను. బెరుకు పోయింది. కానీ ఆ రోజు ఎందుకో మళ్ళీ అదే భయం! బస్సుల్లో ఎలాంటి వాళ్ళు ఎక్కుతారో ఎవరికి తెలుసు?

అతను బస్సెక్కి నేను కూర్చున్న వైపుకే వస్తున్నాడు. నా పక్క సీటు ఖాళీగానే ఉంది, నా వెనుక సీట్లలోనూ ఖాళీలు ఉన్నాయి. "అతను నా పక్కన కాకుండా వెనుక కూర్చుంటే బావుణ్ణు!" అంది నా మనసు! నాకే ఆశ్చర్యం కలిగింది దాని ఆలోచనకి! "అలా అనుకోకూడదు, తప్పు!" అని దానికి బుద్ధి చెప్పాను. అయినా అతను నన్ను దాటి వెళుతున్నప్పుడు నా మనసు "హమ్మయ్య!" అనుకోవడం వినిపించింది! ఇంతలోనే ఏమనుకున్నాడో ఏమో అతను ఒక్కసారిగా ఆగి, వెనక్కి తిరిగి, నా పక్కనే వచ్చి కూర్చున్నాడు! నా మనసు మూలిగింది! నేను మాత్రం అతనికేసి తిరిగి మర్యాదగా ఓ చిరునవ్వు చిందించాను. అతనూ నవ్వుతో బదులిచ్చాడు. ఇంకో పది నిమిషాల్లో నా స్టాప్ రావడంతో నేను దిగిపోయాను. మా మధ్య మాటలు ఏవీ లేవు ఆ రోజు.

2

బస్సు దిగిన వెంటనే నేనీ సంఘటనని ఇట్టే మర్చిపోయాను. చాలా రోజూవారీ సంఘటనలు లానే ఇదీ నా మనస్సుపై ముద్ర వెయ్యలేదు. పక్కరోజు సాయంత్రం ఆఫీసు నుంచి బస్సులో ఇంటికి వెళుతున్నప్పుడూ నాకు గుర్తురాలేదు. అదే స్టాపులో అతన్ని మళ్ళీ చూసినప్పుడు మాత్రమే నాకు ముందు రోజు జరిగిన సంఘటన గుర్తొచ్చింది. నాలాగే అతనూ అదే టైముకు రోజూ ఇంటికి వెళుతున్నట్టు ఉన్నాడు. ఆ రూట్ లో అది ఆఖరి బస్సు. అందుకే ఎంత వర్క్ ఉన్నా, ఆఫీస్ నుంచి ఆ టైముకి బైటపడతాను. బస్సులో రావడం వల్ల కలిగే ఒక ప్రయోజనం ఇది! కారులో వచ్చుంటే రాత్రి తొమ్మిది వరకూ ఆఫీసులోనే ఉండాల్సి వచ్చేది!

అదేంటో ఈ రోజూ అతను వచ్చి నా పక్కనే కూర్చున్నాడు, చుట్టుపక్కల ఇంకా ఖాళీలు ఉన్నా! నేనూ ముందు రోజులానే ఓ చిరునవ్వు పడేశాను. కానీ అతను కూర్చున్న వెంటనే నాతో అన్న మాటలు నన్ను షాక్ కి గురిచేశాయి.

"Do you have a problem with me, man? You seem to be moving away when I sit!"

అంటే ఎంత చిరునవ్వు మొహాన పులుముకుని అతన్ని ఆహ్వానించినా, నా శరీరం నాకు తెలియకుండానే అతనికి దూరంగా జరిగిందా? మొహాన నవ్వును దాటి, పెదాల మాటను దాటి, మంచిని తెలిపే బుద్ధిని దాటి ఎక్కడో మనసు లోతుల్లో ఉన్న భావాన్ని నా "బాడీ లాంగ్వేజ్" చెప్పేసిందా? ఈ నా ప్రవర్తనని అతను రేసిజం అనుకున్నాడా? లేక నేను నిజంగా....రేసిస్టునా?

రేసిస్ట్! రేసిస్ట్! రేసిస్ట్! లోలో ఏదో గొంతు బిగ్గరగా వినిపిస్తూ నాలో కల్లోలాన్ని నింపింది. ఎలాగో తేరుకుని –

"No! No! No! I was just giving room to you" అన్నాను.

అతను "ఓకే" అన్నట్టు చూశాడు. నాకు ఇంకా ఏమి మాట్లాడాలో తెలియలేదు. చాలా సిగ్గుపడ్డాను. నాకు తెలియకుండానే అతనితో అమర్యాదగా ప్రవర్తించానన్న బాధ ఒక పక్కా, నాలోనూ రేసిజం ఉందేమోనన్న అనుమానం మరో పక్క నన్ను అతలాకుతలం చేశాయి. ఇంక మాటలెలా వస్తాయి?

3

ఇంటికి చేరాక శ్రీమతి చిరునవ్వుతో పలకరించినా, ఆరేళ్ళ కూతురు "డాడీ!" అంటూ వచ్చి ప్రేమగా హత్తుకున్నా నేను ముభావంగానే స్పందించాను. ఆ రోజు తొందరగా భోజనం ముగించి నిద్రకి ఉపక్రమించాను. కళ్ళు మూసుకుని నిద్రలోకి జారుకుంటే కళ్ళ ముందున్న నిజాలను తాత్కాలికంగా అయినా మర్చిపోవచ్చు. అందరూ చేసేది అదేగా!

"అప్పుడే నిద్రపోతున్నారు ఏమిటి, ఒంట్లో బావులేదా?" అన్న శ్రీమతి ప్రశ్నకి

"ఏం లేదు. ఈ రోజు ఆఫీసులో పని ఎక్కువ ఉంది, అలిసి పోయాను. అంతే!" అని సరిపెట్టాను.

కానీ నా కూతురు నన్నంత తేలికగా వదిలిపెట్టలేదు. "డాడీ! స్టోరీ!" అంటూ చెంతకొచ్చింది. రోజూ రాత్రి పడుకునే ముందు పుస్తకంలోంచి ఓ కథ చదివి వినిపించడం అలవాటు చేశాను మరి!

"ఈ రోజు వద్దమ్మా! బజ్జో! రేపు చెప్పుకుందాం!" అన్నాను.

మా అమ్మాయి మొహం చిన్నబోయింది.

"నాన్నా! కథ చెప్పు!", ఈ సారి తెలుగులో అడిగింది.

తెలుగులో మాట్లాడమని ఎంత పోరినా ఎప్పుడో కానీ తెలుగులో మాట్లాడని మా అమ్మాయి నన్ను మంచి చేసుకోవాలి అనుకున్నప్పుడల్లా "తెలుగు అస్త్రాన్ని" నాపై ప్రయోగిస్తుంది. కూతురు అంత జాలిగా తెలుగులో అడిగితే కరిగిపోని నాన్న ఉండడు అమెరికాలో!

లైబ్రెరీ నుంచి మేమిద్దరం తెచ్చుకున్న పుస్తకం ఒకటి తీశాను. అది Dr. Seuss రాసిన "What was I scared of?" అన్న పుస్తకం. ఈ Dr. Seuss అన్నాయన అమెరికాలో ఒక సుప్రసిద్ధ పిల్లల పుస్తక రచయిత. ఆయన రాసిన "The Cat in the Hat" కథ తెలియని పిల్లలు అమెరికాలో లేరంటే అతిశయోక్తి కాదు. గొప్ప సృజనాత్మకతతో, అలరించే బొమ్మలతో, కొంగొత్త కథనంతో సాగే Dr. Seuss రచనలు నాకూ, మా అమ్మాయికీ చాలా ఇష్టం. ఆయన రచనలు అన్నీ చదువుదామని లైబ్రెరీకి వెళ్ళినప్పుడల్లా ఓ Dr. Seuss పుస్తకం తప్పకుండా తెచ్చుకుంటాం!

"What was I scared of?" చాలా ఆసక్తికరమైన కథ. ఒకడు రాత్రివేళ బైట నడుస్తూ ఉంటే "లేత ఆకుపచ్చ పేంట్" ఒకటి దూరంగా ఎదురౌతుంది! ఆశ్చర్యం! మనిషీ లేడు, తలా కాళ్ళూ లేవు! కేవలం పేంట్ మాత్రమే నడిచొస్తోంది. ఇదేదో దెయ్యంలా ఉందని తప్పుకుంటాడు. అప్పటి నుంచి చాలా రాత్రిళ్ళు ఈ "లేత ఆకుపచ్చ పేంట్" ని చూస్తూ ఉండడం, తప్పించుకుని "బతుకు జీవుడా" అనుకోవడం జరుగుతూ ఉంటుంది. ఓ రాత్రి అనుకోకుండా ఆ "లేత ఆకుపచ్చ పేంట్" ని అతి దగ్గరగా ఎదురుకోవాల్సి వస్తుంది. అంతే! భయంతో కేకలు వేసి పారిపోబోతాడు. ఇంతలో ఒక సన్నని ఏడుపు వినిపిస్తుంది. తలతిప్పి చూస్తే ఆ "లేత ఆకుపచ్చ పేంట్" భయంతో వణికిపోతూ ఏడుస్తోంది! అప్పుడు తెలిసొస్తుంది – "ఓహో! ఆ "లేత ఆకుపచ్చ పేంట్" కి నేనూ విచిత్రంగా కనిపిస్తున్నానన్న మాట! ఎందుకంటే నేను తనలా లేను కదా! అందుకే నాలాగే తనూ భయపడింది!". వెంటనే ఆ "లేత ఆకుపచ్చ పేంట్" పక్కకి చేరి చేతులతో ప్రేమగా తాకి ఊరట కలిగిస్తాడు. అప్పటి నుంచీ రాత్రిళ్ళు వాళ్ళు ఎదురైనప్పుడల్లా ఏ భయం లేకుండా, చిరునవ్వుతో పలకరించుకుంటారు. అదీ కథ!

కథ చెప్పి మా అమ్మాయిని నిద్రపుచ్చుతూ ఉండగా ఒక్కసారిగా ఆ కథకీ, బస్సులో సంఘటనకీ చాలా పోలిక ఉందని నాకు స్ఫురించింది! మనకంటే భిన్నంగా ఉన్న వాళ్ళని, మనకి తెలియని వాళ్ళని, చూసినప్పుడు సహజంగానే కొంత భయం, అపనమ్మకం కలుగుతాయి. అయితే వాళ్ళూ మనలాంటి మనుషులే అని గుర్తించి, వాళ్లలోనూ మనని చూసుకున్నప్పుడు స్నేహవారధులు ఏర్పడతాయి. ఇలా కాక, గిరి గీసుకుని మనలో మనమే ముడుచుకుపోతూ ఉంటే భయాలూ అపనమ్మకాలూ పెరుగుతాయి. వివక్షకీ దారితీస్తాయి.

ఇలా అనుకోగానే నాకు ఇంకో సంఘటన గుర్తొచ్చింది. అమెరికా వచ్చిన కొత్తల్లో ఓ రోజు నేను ఒక్కణ్ణే కారులో హైవేపై వెళుతూ దారి తప్పిపోయాను. ఫోన్ స్విచ్ ఆఫ్ అయిపోవడంతో గూగుల్ కూడా దారిచూపలేని పరిస్థితి. కొత్తగా వచ్చాను, శాండియాగో నగరం అసలు తెలీదు. "ఎలాగరా దేవుడా!" అని కంగారుపడ్డాను. హైవే నుంచి ఎగ్జిట్ తీసుకుంటే, ఓ కమ్యూనిటీకి చేరుకున్నాను. చుట్టూ ఖరీదైన ఇళ్ళు కనిపిస్తున్నాయి. కానీ రోడ్డుపైన ఒక్కరూ కనబడలేదు దారి అడగడానికి. కారు పక్కకి ఆపి దిగి నడుస్తున్నాను ఎవరైనా కనిపిస్తారేమో అని. ఓ సందులోకి వెళ్ళగానే ఒక "వైట్"

ఆవిడ, ఒక చిన్న బాబుతో సైడ్ వాక్ పైన నడుస్తూ కనిపించింది. ఆ బాబుకి మూడు నాలుగేళ్ళు ఉంటాయేమో, చాలా ముద్దుగా నడుస్తున్నాడు. నేను "హమ్మయ్య!" అనుకుని, పరిగెత్తుకుని ఆమె దగ్గరకి వెళ్ళి "ఎక్స్క్యూజ్ మీ! మామ్!" అన్నాను. ఆమె నన్ను చూసీ చూడగానే కంగారుపడి, ఆ బాబుని ఎత్తుకుని పరుగులందుకుంది! నాకు ఆవిడ ఎందుకు పరిగెడుతోందో అర్థం కాలేదు. "ఇదేం దేశంరా బాబు! అపరిచితులు "హలో" అంటేనే ఉలిక్కిపడుతున్నారు. ఇదే ఇండియాలో అయితే ప్రతి కిళ్ళీ కొట్టువాడు గూగుల్ కి తాతలా దారి చెప్తాడు!" అనుకున్నాను.

ఇప్పుడు ఆలోచిస్తే నా వాలకం ఆవిడని కంగారు పెట్టడంలో మరీ ఆశ్చర్యం లేదనిపించింది. తెలియకపోవడం తెచ్చే దూరం ఇదేనేమో! ఆవిడ "వైట్", నేను "బ్రౌన్" కాబట్టి, ఆవిడ రేసిస్ట్ అనుకోవాలా? నేను కాకుండా ఇంకో "వైట్" వచ్చి అడిగితే ఆవిడ అలాగే పరిగెత్తేదా? బహుశా పరిగెత్తకపోవచ్చు! కానీ నన్ను చూసి పారిపోయినంత మాత్రాన ఆవిడ రేసిస్ట్ కాదేమో! ఆవిడని భయపెట్టింది నా రంగు కాదు, నా వాలకం కావొచ్చు. ఆవిడకి ఆ నిమిషాన నేనో భయపెట్టే "లేత ఆకుపచ్చ రంగు" పేంట్ ని! బస్సులో తారసపడిన ఆ ఆఫ్రికన్ అమెరికన్ నాకో "లేత ఆకుపచ్చ రంగు పేంట్"! రంగును దాటి, రూపాన్ని దాటి, ఎదుటవున్న మనిషిలోని మనిషిని చూసినప్పుడు నేనూ మనిషిని. లేకుంటే భయాన్ని, ద్వేషాన్ని, భీభత్సాన్ని.

నా మనసులోకి నిజాయితీగా తరచి చూసుకుంటే నాలో భయమే తప్ప రేసిజం లేదనిపించింది. ఇది తెలుసుకున్నాక నా మనసు కాస్త కుదుటపడి నిద్రపట్టింది.

4

పక్కరోజు సాయంత్రం బస్ ఎక్కాక ఉత్సాహంగా అనిపించింది. అతను ఆ రోజూ అదే బస్ ఎక్కాలని దేవుణ్ణి మొక్కుకున్నాను! అతని స్టాప్ దగ్గరౌతున్నకొద్దీ అతను ఉంటాడా లేదా అన్న టెన్షన్ పెరిగిపోతోంది. స్టాప్ వచ్చింది, అతను కనిపించాడు. నా మొహంలో ఆనందం! ఒక్కరోజులో ఎంత మార్పు! అతను బస్సెక్కాడు. నా పక్కన కూర్చుంటాడో లేదో? వచ్చాడు. నా పక్కనే కూర్చున్నాడు. హమ్మయ్య! అతను నన్ను క్షమించినట్టు భావించాను. ఈసారి నా నవ్వులో ఓ వెచ్చదనం. ఆనందంతో ఉప్పొంగాను ఏమో, ఈసారి అతను కూర్చున్నప్పుడు మా ఇద్దరి భుజాలూ స్నేహంగా తాకుతూ పలకరించుకున్నాయి.

కొన్ని సెకన్ల పాటూ మా ఇద్దరి మధ్యా ఏ మాటలూ లేవు. అయితే ఈ సారి మా నిశ్శబ్దంలో ఏ "ఇబ్బందీ" లేదు. నిజానికి మాటలు అవసరం లేదేమో, మౌనమే బావుందేమో అనిపించింది.

అతనే ముందు మాట్లాడాడు –

"It is damn hot today, man!" అన్నాడు.

నిజమే! ఎండ మండిపోయింది ఆ రోజు. సాయంకాలం అయినా ఇంకా వేడి పూర్తిగా తగ్గలేదు.

"Yes! But I feel good, very good!" అన్నాను.

అతను ఒకింత ఆశ్చర్యంగా నాకేసి చూశాడు. నా పెదాలపై ఓ చిరునవ్వు. దాని అర్థం నాకే తెలుసు!

మా మనసు మాటలు విప్పుకుంది ఆ వేళ! ఆ రోజు తర్వాత ప్రతీ రోజూ!

★★★

**COMMENTS**